# ప్రమాదవీణ

**రెం**డు నెలల గాలింపు చర్య తర్వాత, ఏ లక్షణాలు గల ఇంటికోసం ఇంతకాలం మేము కలలుగన్నామో అలాంటి అద్దె ఇల్లు దొరకనే దొరికింది.

మా ఆవిడా పిల్లలూ ఆ ఇంటిని చూసి వచ్చినప్పటి నుంచి ఒకటే మెచ్చుకోటం, మురిసిపోవటం!

మేము ఇప్పుడుంటున్న ఇల్లు రెండంటే రెండే గదులు. మా ఆవిడ మాటల్లో చెప్పాలంటే "ముందుగదిలో ఎప్పుడూ మీరు, మీ మిత్రులూనూ, నేను వంటింట్లో వుండి చావటమే గదా!"

ఆ మాటకొస్తే మేము కాపురాలు చేసిన ఇళ్ళన్నీ అంతవరకూ చిన్న ఇళ్లే! ఉన్నంతలో ఎలాగో సర్దుకుపోయేవాళ్ళం. ఈ ఇరుకు ఇళ్ళతో మా ఆవిడ బాగా విసిగిపోయింది. అయితే ఇప్పుడు చేరబోయే ఇల్లు నాలుగు గదులు. అదీ వరుసగా రైలు పెట్టెల్లా గాదు. ఎవరైనా వస్తే కూచునేందుకు ముందు ఓ గది ప్రత్యేకంగా ఉంది. దాని పక్కనే ఓ బెడ్ రూమ్. మా ఆవిడ దానికి పెట్టిన పేరది. ఇవిగాక ఓ చిన్నహాలు, హాల్లోనుండి వెళితే కిచెన్ రూము. కిచెన్ రూమ్ నుండి వెనుకవైపు పెరట్లోకి దారి, పెరట్లో విడిగా బాత్‌రూమ్, లావెట్రీ. వీటి అన్నిటికీ మించి కొత్త ఇంటికి ఓవర్ హెడ్ ట్యాంకు ఉండటం! కావాల్సినన్ని నీళ్ళు. మిషన్ మీటనొక్కితే ట్యాంకునిండా నీళ్ళు. ఇంతకు మించి కావాల్సింది ఏముంది.

అన్నిటికీ మించి ఏ బాధలు లేకుండా, స్వేచ్ఛగా మసలుకోటానికి ఇంటి ఓనరు అక్కడ లేకపోవటం. అంటే స్వతంత్ర ప్రతిపత్తిగల ఇల్లన్నమాట. ఓనరెక్కడో కడపలో ఉద్యోగరీత్యా ఉంటున్నాడు. ఇంటి ఓనర్లు పక్కనే వున్నపోర్షన్లలో కాపురాలు చేసి చేసి, గత పదేళ్ళుగా మేము పడ్డ అవస్థలు తలచుకోటానికే భయం వేసేంతగా ఉన్నాయిమరి. ప్రస్తుతం ఇప్పుడుంటున్న ఇంట్లోనూ అవే బాధలు అనుభవిస్తున్నామాయె! ఓనరులేని ఇల్లు దొరకటమంటే మాటలా! కాకపోతే ఒకే ఒక మైనస్ పాయింట్ ఇప్పుడుంటున్న ఇంటికి నాలుగు వందలు చెల్లిస్తున్నాం. కొత్త ఇంటి బాడుగ ఆరువందలు!

"రెండు వందలు ఎక్కువైతే ఏమండి! బాదరబందీ ఏమీ లేదు. మన ఇష్టానుసారం బతకొచ్చు. కొన్ని ఖర్చులు తగ్గించుకుందాం" అని భరోసా ఇచ్చింది మా ఆవిడ.

"అంతా నీ దయమీద ఆధారపడి వుంటుంది" అన్నాను నేను ముందు జాగ్రత్తగా.

నా మాట విని చిద్విలాసంగా ఒక చిన్న నవ్వు విసిరేసింది శ్రీమతి

ఇల్లుచూసి వచ్చినప్పట్నుంచి అందులో చేరేదాకా, దాన్ని గురించి గంటలు గంటలు ఇంటిల్లిపాదీ మాట్లాడుకోవడమే. ముందు గదిలో ఏవేవి ఉంచాలి? హాల్లో ఏవి అమర్చాలి? బెడ్ రూమ్‌లో ఏ వస్తువులు చేర్చాలి? చేర్చకూడదు? వీటి గురించి చర్చ వారం రోజులపాటు సాగింది.

"ఇంతకూ పుస్తకాలు పెట్టుకోటానికి ఎన్ని గూళ్ళు ఉన్నాయి". అని నేను అడగటం.

"నీకెప్పుడూ నీ పుస్తకాల చింతే"అంటూ తమాషాకయినా అందరూ నన్ను దెప్పిపొడవటం–ఇదీ తంతు!

ఎలాగైతేనేం కొత్త నెల ఒకటోతేదీ రాగానే కొత్త ఇంటిలోకి మారాం. పాత ఇంటికి కొత్త ఇంటికీ దాదాపు మూడు కిలోమీటర్లు దూరం. అయితే నా కాలేజీకి, పిల్లల కాలేజీకి మునుపటి ఇంటికంటే కాస్త దగ్గరే

❖ ❖ ❖

నేను సాయంత్రం కాలేజీ నుంచి వచ్చే సరికి ఇల్లంతా సర్దే కార్యక్రమం పూర్తయింది. అయినా మా ఇంట్లో వున్న సామాను ఎంత గనుక? ఒక పాతకాలంనాటి టేబులూ, రెండు ఇనుపకుర్చీలూ, ఒక మంచం, ఒక బీరువా, ఈమధ్యనే వాయిదాల్లో తెచ్చుకున్న ఒక తెలుపూ, నలుపూ టీవీ! కాకపోతే నా పుస్తకాలున్నాయనుకోండి చిన్న బండెడు. వాటిని సర్దటానికే అసలు అవస్థలన్నీ. ఇంట్లో పిల్లలతో సహా బాగా ఆ అవస్థలన్నీ పడుతున్నారేమో! ఇంట్లోకి రాగానే నా పుస్తకాలమీద చిన్నదాడి చేసింది మా ఆవిడ.

నా పుస్తకాలంటే ఇంట్లో ఎవరికీ పెద్ద ఎలర్జీ లేదుగానీ, ఏదేనా ఖర్చుల విషయం వచ్చినప్పుడు మాత్రం నా పుస్తకాలమీద కూడా ఒక చిన్న దెబ్బ వెయ్యకుండా ఉండదు మా ఆవిడ.

"ఇంట్లో సామానంతా ఒక ఎత్తు. మీ పుస్తకాలే ఒక ఎత్తు" అంటుందామె. ఇల్లు మారినపుడు నా పుస్తకాలను ప్యాక్ చేయటానికే పెద్ద అట్టపెట్టెలు ఇరవైదాకా కావాల్సి వచ్చాయి. వాటి రవాణా వ్యవహారం, మళ్ళీ కొత్త ఇంటిలో వాటిని సర్దటంతో.

"అసలు నా బాధలన్నీ మీ పుస్తకాలవల్లే వచ్చాయి" అంటూ దెప్పి పొడిచింది.

"ఈ పుస్తకాలన్నీ అమ్మేస్తే మనం ఒక చిన్న బంగళా కొనుక్కోవచ్చు నాన్నా" అంటూ జోక్ చేసింది మా చిన్నమ్మాయి.

ఇంతకూ వీళ్ళ ఇన్ని విమర్శలకు గురి అవుతున్న ఆ పుస్తకాలకు నేను పెట్టిన ఖర్చు ఎంత? సగటున నెలకు ఓ వంద చొప్పున కూడా దాటి ఉండదు. నేను సిగరెట్లు కాల్చను, కిళ్ళీలు వేసుకోను. కాఫీ అలవాటు అసలు లేదు. రోజుకు ఓ ప్యాక్ సిగరెట్టు తాగే భర్తను ఏ భార్యా పెద్దగా పట్టించుకోదు గాని, నెలకు ఒక వంద రూపాయల పుస్తకాలు కొనే భర్తను మాత్రం సంసారాన్నంతా సర్వనాశనం చేసే శత్రువులా చూస్తారు. "నేను రోజుకో ప్యాక్ సిగరెట్లు కాలిస్తే నెలకు రెండు వందల ఖర్చవుతుంది. అందులో సగం కూడా నేను పుస్తకాలకు తగలెయ్యటం లేదుకదా"అంటే

"అయినా ఖర్చు ఖర్చేగదా" అంటుంది మా ఆవిడ.

"నేను ఉద్యోగం చేయబట్టి పాతికేళ్ళవుతుంది. ఈ పాతికేళ్ళలో నేను కొన్న పుస్తకాలన్నీ లెక్క వేసినా, పదిహేను వేల రూపాయలు దాటవు. కాని నాతోపాటు ఉద్యోగం చేస్తున్న మాధవ ఈ పాతికేళ్ళలో నలభైవేల రూపాయల సిగరెట్లు కాల్చివుంటాడోయ్" అని నేను లెక్కలు కడితే,

"సిగరెట్లు కాల్చేవాళ్ళతో మిమ్మల్ని పోల్చుకోవటమేం ఖర్మ? ఏకంగా మంచి తాగుబోతులతో పోల్చుకోండి. ఇంకా లాభంగా ఉంటుంది" అంటుందామె కసితో కూడిన చిన్న నవ్వు నవ్వేస్తూ.

పుస్తకాలపై చర్చ పెరగకుండా నేను ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకుంటూ వుంటాను. కాని ఆరోజు మా ఆవిడ.

"మీ పుస్తకాల ఖర్చు లేకుండా వుంటే ఇల్లు ఇంత అధ్వాన్నంగా వుండేదేమండి?"అంటూ నా రెక్క పట్టుకొని ముందు గదిలోకి ఈడ్చుకెళ్ళింది.

మా అమ్మాయిలిద్దరూ ఈ వ్యవహారాన్ని తమాషాలా చూస్తున్నారు. ముందుగది ఎంతో శుభ్రంగా, ఖాళీగా వుంది.

"చూడండి ఈ గది ఎలా వుందో" అంది మా ఆవిడ దూకుడుగా!

"ఈ గదికేమయింది? పదహారు చదరపు గజాల గది. ఎంతో విశాలంగా వుంది అరుణా! హాయిగా చాపలు పరుచుకుని ఇంటిల్లిపాదీ ఇక్కడే పడుకోవచ్చు"న్నాను తెచ్చికోలు నవ్వుతో.

"ఏడ్చినట్లే వుందిగానీ మీ తెలివి! ఎవరైనా వస్తే ఈ గదిలో కూర్చోటానికి మనకు రెండు మంచి కుర్చీలైనా ఉన్నాయటండీ" అంది ఆవేశంగా.

"ఇంతకూ ఇప్పుడీ గొడవంతా ఎందుకే" అన్నాను విసుగు నటిస్తూ.

"నేను చెప్పే మాటలు మీకు గొడవగా ఉన్నాయటండీ! అసలు ఇంటిగొడవ మీరెప్పుడైనా పట్టించుకున్నారా? ప్రతి దానికి ఉపన్యాసం ఒకటి ఇవ్వటమొచ్చు. ఏ వస్తువుపట్ల అయినా మీకు శ్రద్ధ వుందా? కొంపకేం కావాలి అన్న ఆలోచన మీకెప్పుడైనా వచ్చిందా? ఇన్నేళ్ళయింది కాపురం వెలగబెట్టబట్టి. నా ముఖానికి ఒక మిక్సీ అయినా తెచ్చారటండీ మీరు. ప్రతి ఉద్యోగస్తుని కొంపలోనూ మిక్సీలు రాట్నమాడుతూవుంటే, నేనింకా రుబ్బురోలుతోనే మిడుకుతున్నాను. ఇల్లు సన్యాసుల కొంపలా వుండటమే మీకిష్టం. ముందు నా మాట వినండి. ఎల్లకాలం ఇలాగే ఉండటం కుదరదింక మీరెలా తెస్తారో నాకు తెలియదు. రేపటికి నాలుగు మంచి కుర్చీలు - కుర్చీలంటే మీరు మెచ్చుకునే ఇనుపడొక్కు కుర్చీలు కాదు. వైర్ల కుర్చీలుకావాలి. వాటి మీద నాలుగు మెత్తని దిండ్లు కూడా" అంది దాదాపు ఆర్డరు వేస్తున్నట్టుగా.

"ఓసినీ.. ఇంత సడన్‌గా ఇప్పుడేమొచ్చిందే నీకు. కుర్చీల కోసం రూమ్ కావాల్సి వచ్చిందా. రూమ్ కోసం కుర్చీలు కావాల్సి వచ్చాయా? ఇన్నాళ్ళూ లేని అపురూపమైన మనుషులు ఎవరొస్తారే మనింటికి! వైర్ల కుర్చీల్లో మెత్తటి దిండ్లమీద కూచుంటే తప్ప బతకలేమనే అతిథులెవరున్నారే మనకు" అన్నాను.

"ఎవరున్నారు మనకు? మనింట్లో వున్న డొక్కు కుర్చీల్లో కూచునే డొక్కు మనుషులే గదా మీ మిత్రులు. నా దగ్గర మీ లాజిక్ కట్టి పెట్టి ముందు కుర్చీలు తెచ్చి వెయ్యండి. ఇన్నాళ్ళూ ఇప్పుడూ, ఒకేలా ఎలా అవుతుంది? ఇంట్లో ఎదిగిన ఆడపిల్లలు ఇద్దరున్నారాయె. రేపు ఏవైనా సంబంధాలు మనింటికి రావాలా? వద్దా?" అందామె భవిష్యత్తునంతా నా ముందు పరుస్తూ.

"ఓహో ఇదన్నమాట నీ దురాలోచన. మన పిల్లలకేమే బంగారంలాంటి వాళ్ళు. మెత్తని కుర్చీల వల్లే మంచి మొగుళ్ళు వస్తారా ఏవిటి? అలాంటి వెధవలు మనకెందుకే"అంటూ నేను వాతావరణాన్ని తేలిక చేయబోయాను.

"మీ డొంకతిరుగుడు వ్యవహారం కట్టిపెట్టి రేపటికల్లా కుర్చీలు తెచ్చే ఏర్పాటు చేయండి" అందామె తీవ్రంగా.

సరే... ఇదేదో పీకలమీదకొచ్చిన వ్యవహారంలా ఉంది అనిపించి "సరే చూద్దాంలే వోయ్ రేపంటే రేపేనా! వచ్చే నెలలో చూద్దాం" అన్నాను.

"ఒక నెలంతా ఈ రూమును ఇలా నోరు వెళ్ళబెట్టినట్టు ఉంచమంటారా ఏమిటి? అదేం కుదరదు" అంటూ జవాబు ఆశించకుండా లోపలకు వెళ్ళింది ఆమె.

నాలుగు రోజుల తర్వాత కాలేజీ నుండి ఇంటికొచ్చేసరికి, లోపల ఇల్లంతా సందడిగా ఉంది. నాలుగైదు జతల చెప్పులున్నాయి, తలుపు దగ్గర, అన్నీ ఆడవాళ్ళవే. నేను లోపలి దాకా వెళ్ళకుండా బయటి గదిలోనే తచ్చాడుతూండిపోయాను. నేను వచ్చిన విషయం ఇంట్లో గుర్తించినట్టున్నారు. పది నిమిషాల తర్వాత వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు.

నేను లోపలకు వెళ్ళి బట్టలు మార్చుకొని బాత్ రూం కెళ్ళి వచ్చి హాల్లో కూచుండిపోయాను. మా పెద్దమ్మాయి నీళ్ళు తెచ్చి యిచ్చింది. "ఎవరమ్మా ఆ వచ్చినవాళ్ళంతా" అనడిగాను.

"ఈ వీధిలోవాళ్ళే నాన్నా! ఇల్లంతా తిరిగి మనల్ని వంద విమర్శలు చేసి వెళ్ళారు. మన ఇంట్లో ఒక్క సామాను లేదట. ఇంత పెద్ద ఇల్లును ఇలాగేనా ఉంచుకోవటం అనేశారు. ఇంతకు మునుపు ఈ ఇంట్లో ఉన్నవాళ్ళకైతే కలర్ టీవి, ఫ్రిజ్, ఏర్ కూలర్, వాషింగ్ మిషన్, సోఫాసెట్లూ, డైనింగ్ టేబులూ, నాలుగు రూముల్లోనూ నాలుగు ఫ్యాన్లు, మూడు బీరువాలూ, ఇంట్లో కాలుపెట్టడానికి వీల్లేకుండా ఇంటి నిండా సామాన్లు ఉండేవట! ఒకావిడైతే 'స్టీలు సామానంతా ఇదేనేమమ్మా' అని మొహం మీదనే అడిగేసింది. నీ పుస్తకాలన్నీ చూసి, 'మీకేమైనా పుస్తకాల షాపు ఉందా" అని ఒకావిడా, "ఇవన్నీ కొన్న పుస్తకాలేనా?" అని ఒకావిడా, "పుస్తకాలు కొని చదువుతారేమమ్మా మీ పిచ్చిగాకపోతే" అని మరో ఆవిడా, "మీ ఆయన మరీ పిచ్చాయనలా ఉన్నారే" అని ఒకరూ, ఒకటే కామెంట్స్ అనుకో! అమ్మ చాలా బాధపడుతోంది నాన్నా" అంది మా అమ్మాయి.

నేను వచ్చి అరగంట అయింతర్వాత కూడా శ్రీమతి నా ముందుకు రాలేదు. బెడ్‌రూమ్‌లో ఉందేమో! ఇంతకు ముందున్న రెండు గదుల చిన్న ఇంట్లో అందరూ కుప్పబోసినట్లుగా ఒకే చోట సందడిగా ఉండేవాళ్ళం. ఇప్పుడేమో బెడ్ రూమ్‌లో ఒకరుంటే, హాల్లో ఒకరు, వంటింట్లో ఒకరుంటే ముందుగదిలో ఒకరు, ఎక్కడివాళ్ళక్కడ

అన్నట్లు విడిపోయినట్లు అనిపిస్తుంది నాకు. 'చింతలు లేని ఇల్లు చిన్న ఇల్లు' అన్న నినాదాన్ని సంతానానికేగాక ఇంటికి కూడా వర్తింప చేసుకోవాలి అనిపించింది నాకు.

నేను నెమ్మదిగా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాను. లోపల మంచం మీద కూచుని ఏడుస్తోంది అరుణ. నేను ఆశ్చర్యపోయాను. వెళ్ళి పక్కన కూచుని "ఏమిటి నీకేమైనా పిచ్చిపట్టిందా" అన్నాను అనునయంగా. ఆమె కోపంగా నా వేపు చూస్తూ–

"నాకు కాదండీ పిచ్చి, అందరి కొంపలూ ఇట్లాగే తగలడ్డాయేమో చూడండి. పేరుకు చేసేది గజిటెడ్ ఆఫీసరు ఉద్యోగం, అటెండర్ల కొంపకన్నా అధ్వాన్నం చేశారు" అంది.

"చూడు అరుణా, ఎవరి జీవితాలు వాళ్ళవి. ఒకరితో మనల్ని ఎప్పుడూ పోల్చుకోకూడదు. ఈ వస్తుదాహానికి అంతువుండదు. ఏ వస్తువైనా మన అవసరాలు తీర్చటానికేగాని ప్రదర్శనకు గాదు. మనకంటే, ఉన్నతమైన ఒక వర్గం సంస్కృతిని అనుకరించే ప్రయత్నం ఇదంతా. మన పాదాలు భూమికి ఆనేలా మనం చూసుకోకపోతే ఎలా? మనం ఎదుటి వాళ్ళకోసం కాకుండా, మనకోసం బతికితే చాలా సమస్యలు తగ్గిపోతాయి" అన్నాను నచ్చచెప్పే ధోరణిలో.

"ఈ ఉపన్యాసం నాకీరోజు కొత్తగా చెబుతున్నారా మీరు? ఈ పాతికేళ్ళుగా మీ మాటలు విని వినీ నేను ఇలా పాడైపోయాను. మాట వచ్చినప్పుడల్లా 'మనిషికి మంచి తిండి ముఖ్యంగానీ, పైపై మెరుగులన్నీ ఆత్మ వంచనకోసమే' అంటూ నన్ను వంచించారు. మనం కడుపుకు తినేది ఎవరు చూస్తారండీ, అందరితోపాటు మనమూ నాలుగు సామాన్లూ, మంచి బట్టలూ తెచ్చుకుందామని నేను ఎంత పోరినా నన్ను మీ వెర్రిమాటలతో వెర్రిదాన్ని చేశారు. ఇక నేను వినను" అంది ఖచ్చితంగా. ఆమె మాటలు పసిపిల్ల మాటల్లా అమాయకం అనిపించి నాకు నవ్వు వచ్చింది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు అరుణా" అన్నాను నిస్సహాయత ధ్వనింపచేస్తూ.

"ముందు మీరు ఆ పుస్తకాలు కొనటం మానండి. మీ తిండి ఉపన్యాసం కట్టిపెట్టండి. నేను చెప్పినవన్నీ ఒక పద్ధతి ప్రకారం ఇంటికి తెచ్చెయ్యండి. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో మనకు కావాల్సినవన్నీ వాళ్ళ బంధువుల షాపులో ఇప్పిస్తానంది మూడో ఇంటి ఆవిడ" ఇలా చెప్పుకుపోతూ కూచుంది.

"అయ్యో! తిక్కదానా! నా పుస్తకాల ఖర్చు ఇరవై ఏళ్ళు తగ్గించినా మనకు ఒక కలర్ టీవీ కూడా రాదే! ఆ పుస్తకాలు కూడా మనపిల్లలకు ఆస్తేకదా"అని నేనింకా ఏదో చెప్పబోతూండగా.

"ఆపండి మీ వెర్రి వాగుడు, సన్నాసుల్లా కాకుండా అందరిలా బతకడం నేర్చుకుందాం మనం కూడా! ఇన్నేళ్ళయినా మన పిల్లలకు నాలుగు జతల మంచి బట్టలున్నాయిటండీ! వచ్చిన వాళ్ళు బీరువా తెరచి మన బట్టల్ని చూసి ఒకే నవ్వుకోటం" అంటూ ఉన్నఫళంగా గట్టిగా ఏడ్చేసింది.

నేను రెండు అరచేతుల్లో ఆమె ముఖాన్ని దగ్గరగా తీసుకుని "నవ్వి పారేయాల్సిన విషయాలకు నువ్వు ఏడుస్తూంటే నాకు చాలా విషాదంగా ఉంది అరుణా" అంటూ నుదుటిమీద చిన్న ముద్దు పెట్టి బయటకు వచ్చేశాను.

❖ ❖ ❖

వారంరోజుల తర్వాత కాలేజీనుండి ఇంటికి వస్తుండగా, వీధి మలుపు తిరిగేటప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది మా రామారావు మాస్టరు ఇల్లు పక్కవీధిలోనే అని. నేను హైస్కూల్‌లో చదువుకొనే రోజుల్లో నాకు అత్యంత ప్రీతిపాత్రుడైన, నేను చాలా గౌరవించే మాస్టారు ఆయనే. ఆయన మాకు మూడేళ్ళు సోషల్ స్టడీస్ బోధించారు. ఒక సంవత్సరం ఇంగ్లీషు కూడా చెప్పారు. అప్పట్లో తరచూ ఆయన ఇంటికి వెళ్ళేవాణ్ణి నేను. నేనంటే కూడా చాలా అభిమానం ఆయనకు. మేము చదువుకునే రోజుల్లో ఆయన గురించి చాలా ఆసక్తికరమైన కథలు వ్యాప్తిలో ఉండేవి. అందుకు కారణం ఆయన బ్రహ్మచారి కావటం. ఆయన ఎవర్నో ప్రేమించారనీ, ఆ ప్రేమ విఫలమయిందనీ, అప్పట్నుంచీ బ్రహ్మచారిగానే జీవితం గడుపు తున్నాడనీ చెప్పుకొనేవారు. ఆ చిన్న వయస్సులో చాలా విషయాలు అర్థమయ్యేవి కావు నాకు. కాని ఆయన ఆదర్శ జీవితమూ, బోధనపట్ల ఆయనకున్న ఆసక్తీ నిరాడంబరత్వమూ ఆయన స్ఫురద్రూపమూ, ఠీవీ, నడకా, పిల్లలపట్ల ఆయన చూపే ప్రేమా, నన్ను బాగా ఆకట్టుకున్నాయి. ఆయనంటే ఒక ఆరాధనా భావం వుండేది నాకు. ఉద్యోగంలో చేరినతర్వాత కూడా అప్పుడప్పుడూ ఆయన్ను కలిసేవాణ్ణి. నాలుగైదేళ్ళక్రితం ఆయన రిటైరయ్యారని తెలిసింది. ఈ మధ్యకాలంలో ఉద్యోగరీత్యా వేరే వూళ్ళు తిరగటం వల్ల ఆయన్ను కలిసే అవకాశం నాకు లేకపోయింది. మళ్ళీ ఈ వూరొచ్చి ఆరునెల్లయినా ఇంటికి దూరం కావటంతో కలవాలని అనుకుంటూనే అశ్రద్ధ చేశాను. తీరా ఆయన ఇంటికి దగ్గర్లో ఉండికూడా, కలవకుండా ఎలా?

వెంటనే సైకిల్ మళ్ళించి ఆయన ఇంటి వైపు వెళ్ళాను. ఆయనకో అన్నగారు ఉన్నారు. ఆయన పేరు కృష్ణారావు. విచిత్రమేమిటంటే ఆయన కూడా బ్రహ్మచారే

కావటం. కారణాలు ఎవరికీ తెలియవు. ఆయన స్థానిక ఆర్ట్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి, చాలా ఏళ్ళక్రితమే రిటైర్ అయ్యారు.

మాస్టరు ఇంటిముందు సైకిల్ నిలిపి, స్టాండు వేసి మెట్లెక్కాను. ముప్పయి సంవత్సరాల క్రితం ఎలా వుందో అలాగే ఇప్పటికీ వుంది ఆ ఇల్లు! పెంకులు పరచిన వసారా. వసారాకు అటూ ఇటూ ద్వారపాలకుల్లా తడకలూ, వెల్లవేసిన శుభ్రమైన గోడలూ! రెండు పెద్ద మేడల మధ్య ఆ పాత ఇల్లు ధనికులమధ్య పేదవాడిలా కనిపిస్తూ వుంది. వసారాలో అప్పుడప్పుడే తుడిచినట్టు నల్లటి నాపరాళ్ళు.

"సార్" అని పిలుస్తూ నెమ్మదిగా తలుపు తట్టాను రెండు సార్లు. రెండు నిముషాల తర్వాత "ఎవరూ"అంటూ తలుపు తీశారు మాస్టారు. "నేనే మాస్టారూ రామ్మూర్తిని" అంటూ నమస్కారం చేశాను. ఆయన అరనిమిషం నన్ను నిదానంగా చూసి "నువ్వా!రామూ! రా... రా... చాలా కాలానికి కనిపించావు"అంటూ నన్ను లోపలకు ఆహ్వానించారు. లోపల అడుగు పెట్టగానే ముప్పయి సంవత్సరాలు వెనక్కు వెళ్ళినట్టు ఒక విచిత్రమైన భావన నన్ను ఆవహించింది. ఆ ఇంట్లో ఎప్పుడు అడుగుపెట్టినా అదే భావన. కాలచక్రం వెనక్కు నడచినట్టు!

గదిలో చాపమీద కృష్ణారావుగారు వజ్రాసనంలో కూచుని ఏదో చదువుకుంటున్నారు. ఆయన చుట్టూ ఒక పద్ధతిలో పేర్చిన పుస్తకాలూ, పేపర్లూ! ఒక్క నిమిషంపాటు నన్ను చూసి చిన్నగా నవ్వారు గుర్తించినట్లుగా! నన్నూ కూచోమని చేతితో సంజ్ఞ చేశారు.

గదిగోడలన్నీ తెల్లగా ఏ ఆచ్ఛాదనా లేకుండా, నిర్మలంగా నిరాడంబరంగా ఉన్నాయి – ప్రతిదీ కుదురుగా తీర్చి దిద్దినట్టుగా. ఏదో ప్రశాంతమైన ఆశ్రమంలో ఉన్నట్లు పల్చటి నిశ్శబ్దం ఆ గదినిండా! చల్లటి బండలమీద, తెల్లటి చాపపై ఆయనకెదురుగా కాళ్ళు మడత వేసుకొని కూచున్నాను. ఆయన చేతిలో కన్యాశుల్కం తొలిప్రతి వుంది. కన్యాశుల్కం మీద పెద్ద అథార్టీ ఆయన. మాలపల్లీ, కన్యాశుల్కమూ, మహాప్రస్థానమూ తడమకుండా – తెలుగు సాహిత్యాన్ని గురించి ఆయన మాట్లాడడు. ఆయన పక్కనే పాతకాలం నాటి ముసలి ట్రాన్సిస్టరూ, ఆయన వెనకాల పాతకాలం నాటి చెక్కబీరువాలో ఒక క్రమంలో పేర్చిన పుస్తకాలు, చూరునుండి దాదాపు ఆయన నెత్తిమీద దాకా వేలాడుతూ వెలుగునిస్తున్న బల్బు, ఎన్నేళ్లుగానో ఇదే వాతావరణం. ఏ కొత్త మార్పు కనిపించని ఆ గది! ఆ ఇంటి మొత్తం మీద ఒక్క కుర్చీ లేదు.

గదంతా పరచిన నాలుగు చాపలు మాత్రమే. కనీసం ఆధునిక నాగరికతకు మేటి గుర్తు అయిన టీవీ కూడా లేదు. ఉన్నవల్లా పుస్తకాలూ, పత్రికలూ, పేపర్లూ!

రామారావు మాస్టారు పక్కగదిలో బొగ్గుల పొయ్యి ముందు కూచుని, ఒక పాత అట్టతో బొగ్గుల్ని విసురుతూన్నారు. పొయ్యిమీద అదే పాత కంచు పాత్ర. ఆ ఇంటికి వచ్చినపుడల్లా నాకు ఒకటే ఆశ్చర్యం. ఒక చిన్న మార్పూ లేకుండా ఏళ్ళ తరబడీ ఒకే విధంగా వీళ్లు ఎలా బతుకున్నారా అని! కానీ అడిగే ధైర్యం నాకు ఎప్పుడూ ఉండేది కాదు. వంటగదిలో కూచొనే నా గురించి ఆయన ప్రశ్నలు వేస్తున్నారు. నా బదిలీ గురించి, మా కాలేజీ గురించి, మా కుటుంబం గురించి నాలుగైదు ప్రశ్నలు వేశారు. అడిగన మాటకల్లా చెబుతూ, వాళ్ళ ఆరోగ్యం గురించి మర్యాదపూర్వకంగా నాలుగు మాటలు అడిగాను. కృష్ణారావుగారు కన్యాశుల్కం శతజయంతి గురించి ఎంతో ఉత్సాహంగా చెపుతున్నారు నాతో. అరగంట సేపు వాళ్ళతో గడిపి 'వెళ్ళొస్తా మాస్టారూ" అంటూ లేచి నిలబడ్డాను. "దగ్గర్లోనే కదా అప్పుడప్పుడూ వస్తూండవోయ్" అంటూ తలుపుదాకా వచ్చి నన్ను సాగనంపారు మాష్టారు.

నేను బయటికి వచ్చి మళ్ళీ కొత్త ప్రపంచంలోకి అప్పుడే అడుగుపెట్టినట్టుగా అనుభూతి చెందాను.

ఇంటికి చేరుకునేసరికి, ఆరు దాటుతోంది. ముందుగదిలో అడుగుపెట్టగానే, నిటారుగా కూచున్నట్టున్న నాలుగు మెత్తని దిండ్ల కుర్చీలూ, వాటి ముందు పొడవాటి టీపాయ్, కొట్టొచ్చినట్టు కన్పించాయి. పైన కొత్తగా ఫాన్ తిరుగుతున్న చప్పుడు. మా పెద్దమ్మాయి ఎదురువచ్చి, నా చేతిసంచీ తీసుకుని "బావున్నాయి కదూ నాన్నా" అంది. నేను నవ్వుతూ తలూపాను. లోపలహాల్లోకి వెళ్ళగానే సోఫాసెట్టూ, టీవీకింద కొత్తటీవీ స్టాండూ కన్పించాయి. లోపల ఏదో ఆడిస్తున్న మిక్సీ' చప్పుడు.

నేను బట్టలు మార్చుకొని సోఫాలో కూచున్నాను. అరుణ ఎదురుగా వస్తే, "ఒక రోజులోనే ఇల్లంతా మార్చేశావోయ్! ఎలా నడుపుకొచ్చావు వ్యవహారం" అన్నాను.

"ఇంతకు ముందు మీతో చెప్పానే! ఆవిడే నన్ను తీసుకెళ్లి ఈ సరంజామా అంతా ఇప్పించింది. మొత్తం ఆరువేలు. ఇప్పటికి పది వాయిదాల్లో తీర్చేట్టు" అంది.

"అయితే పయనం ప్రారంభమయిందన్న మాట" అన్నాను నవ్వుతూ.

"మీ మాటలకేం లెండి" అంటూ నా పక్కనే కూచుని "చాలా ఆలస్యంగా వచ్చారే ఇంటికి"అని అడిగింది.

మాస్టారు ఇంటికి వెళ్ళిన విషయం చెప్పాను. ఆయన గురించి అరుణకు ఒకటి రెండు సందర్భాల్లో చెప్పిన గుర్తు. "ఎంత ఆశ్చర్యమో అరుణా! మాస్టారి ఇంట్లోకి వెలితే ఏదో అద్భుతలోకం వెళ్ళినట్టుగా ఉంటుంది నాకు. నేను చదువుకొనే రోజుల్లో ఆ ఇల్లు ఎలా వుందో ఇప్పటికీ అలాగే వుంది. ఏ చిన్న మార్పూ కనిపించదు. అందరి ఇళ్ళల్లో ఎన్నెన్ని మార్పులు వచ్చాయి. ఆయన ఇంట్లో ఇప్పటికీ చాపలే! ఒక్క కుర్చీ కూడా లేదు. పాతకాలం కంచుపాత్రలూ, కంచు గ్లాసులూ ఇప్పటికీ, అదే బొగ్గుల పొయ్యిమీద ఇప్పటికీ వంట. వాళ్ళుకొనాలనుకుంటే ఎన్నెన్నో కొనచ్చు. ఆధునిక నాగరికతనంతా ఇంట్లో దింపవచ్చు. కాని వాళ్ళకా దృష్టే లేదు. ఇంటినిండా కేవలం పుస్తకాలే. ఎంత నిరాడంబరమో వాళ్ళ జీవితం. తాము విలాసంగా బతకాలనీ, సౌకర్యాలు అనుభవించాలనీ దృష్టే లేదు వాళ్ళకు. ఏ ప్రభావాలకూ లొంగని గొప్ప మనుషులు వాళ్ళు. విజయవిలాసంలో ధర్మరాజు గురించి అన్నట్లు "నూతన ప్రియాటోపము లేని నిశ్చలురు వాళ్ళు–"అంటూ ఆపకుండా వాళ్ళను పొగడసాగాను.

అరుణ అంతా వింటూ గట్టిగా నవ్వింది. నేను మాటలు ఆపి ఆమెవేపు చూశాను.

ఆమె రెండు చేతులూ ఊపుతూ, "అయ్యా! మహానుభావా! ముప్పయి ఏళ్ళ కిందట ఆ ఇల్లు ఎలా వుందో, ఇప్పటికీ అలాగే వుందంటే అదంతా వాళ్ళ గొప్పతనం కాదు స్వామీ" అంది నవ్వుతూనే. "ఏమిటా"అన్నట్లు ఆమె వేపు ఆసక్తిగా చూశాను నేను.

"ఆ ఇంట్లో ముప్పయి ఏళ్ళుగా ఆడది అన్నది లేకపోవటమే అందుకు కారణం" అంటూ నా కీర్తిగానాన్ని ఒక్క ముక్కలో కొట్టిపారేసింది ఆమె.

ఈ మాట అన్నవెంటనే ఆమె సడన్‌గా నాలుక కరచుకుందో లేదో, నేను గమనించలేదుగాని, ఆమె మాటలు పెద్ద 'షాక్'లా తగిలి, కొత్త ఆలోచనల్లో పడిపోయాను నేను.

**❖ విపుల, జనవరి1993**